క్లుప్తంగా

పాఠశాలకు పుస్తకాల వితరణ



పుస్తకాలతో విద్యార్థులు

జి.సిగడాం: సీతంపేట పంచాయతీ సక్కపేట ఎంపీపీ పాఠశాలకు ప్రకాశ గ్లోబల్ ఎన్ఆర్ఐ ఫౌండేషన్ రూ. 15 వేల విలువైన ఐదు వందల పుస్తకాలను వితరణగా సోమవారం అందజేశారు. ఉపాధ్యాయులు పప్పల వేణుగోపాలరావు, పేర్ల కృష్ణవేణి ద్వారా పుస్తకాలను విద్యార్థులకు పంపిణీ చేశారు.

సీతారాముల కల్యాణానికి పందిరిరాట



పందిరిరాట వేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: సీతారాముల కల్యాణ ఉత్సవం నిర్వహణ నిమిత్తం పందిరిరాట కార్యక్రమం సోమవారం జరిగింది. స్థానిక మొండేటివీధిలోని షిర్డీసాయిబాబా ఆలయ ఆవరణలో కల్యాణ మహోత్సవం ఈ నెల ఐదో తేదీన జరుగుతోందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కొవ్వాడలో ఘనంగా సంబరాలు



పూజా సామగ్రిని సముద్రంలో కలుపుతున్న కొవ్వాడ గ్రామస్తులు

రణస్థలం: కొవ్వాడ, చిన్న కొవ్వాడ గ్రామాల పరిధిలో వాసుపల్లి సంబరాలు సోమవారం ఘనంగా జరిగాయి. భక్తులు కాషాయ వస్త్రాలు ధరించి పూజా సామగ్రిని పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం పూజా సామగ్రిని సముద్రంలో కలిపి.. గ్రామాలకు మంచి జరగాలని మొక్కులు తీర్చుకున్నారు.

స్పందన ఫిర్యాదులపై దృష్టి



స్పందన నిర్వహిస్తున్న అధికారులు

జి.సిగడాం: స్పందనలో వచ్చే ఫిర్యాదుపై ప్రత్యేక దృష్టిసారిస్తున్నామని తహసీల్దార్ పప్పల వేణుగోపాలరావు, ఎస్సై సామంతుల రామారావు చెప్పారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. రెవెన్యూ, శాంతిభద్రతలపై వచ్చే ఫిర్యాదులను పరిష్కరిస్తామన్నారు. గ్రామాల్లో శాంతిభద్రులు క్షీణించకుండా ప్రజలు సహకరించాలన్నారు. ఎంపీడీవో ఎస్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బుడతవలసలో 'గ్రౌండ్ వేలిడేషన్'



భూ వివరాలను రైతులకు తెలియజేస్తున్న సిబ్బంది

లావేరు: బుడతవలస గ్రామంలో సమగ్ర భూముల రీ సర్వేలో భాగంగా వీఆర్వోలు, సచివాలయాల సర్వేయర్లు గ్రౌండ్ వేలిడేషన్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఇందులో భాగంగా భూమి ధ్రువీకరణ వివరాలను రైతులకు తెలియజేశారు. అభ్యంతరాలు స్వీకరించారు. వీఆర్వో శ్రీనివాసరావు, సర్వేయర్ ప్రకాష్ పాల్గొన్నారు.

యాజమాన్య ఖర్చులు తగ్గాలి



పొలంబడి నిర్వహిస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: పంటల సాగులో రైతుల యాజమాన్య ఖర్చులు తగ్గాలని ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ లక్ష్మున్నాయుడు అన్నారు. జరజాం పంచాయతీ గొలివివానిపేటలో ప్రకృతి వ్యవసాయ ఖరీఫ్ కార్యాచరణ ప్రణాళికపై సోమవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఖరీఫ్‌లో ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో వ్యవసాయసాగు పెరగాలన్నారు. నవధాన్యాల సాగును పచ్చిరొట్ట ఎరువుగా సాగు చేయాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో రీసోర్స్‌పర్సన్ మెట్ట ధనుంజయ్ పాల్గొన్నారు.

మహిళలకు అగ్రతాంబూలం



శ్రీకాకుళం రూరల్: చెక్కును అందజేస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

- ఆసరా సంబరాల్లో మంత్రి ధర్మాన

శ్రీకాకుళం రూరల్: మహిళా సంక్షేమమే వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం ధ్యేయమని రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. ఇందులో భాగంగానే సంక్షేమ పథకాల్లో మహిళలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అగ్రతాంబూలం వేశారన్నారు. రాగోలు గ్రామంలో సోమవారం మూడో విడత ఆసరా సంబరాలు నిర్వహించారు. శ్రీకాకుళం నియోజకవర్గంలోని రాగోలు, గూడేం, వాకలవలస, లంకాం, చాపురం, పాత్రునివలస, పెదపాడు పంచాయతీలకు చెందిన 556 గ్రూపుల్లోని 6,116 మందికి రూ. 4.16 కోట్ల విలువైన చెక్కును మహిళా సంఘాలకు మంత్రి అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. పురుషులతో సమానంగా ఇల్లాలికి ఆర్థిక ఆసరా దక్కేవిధంగా అమ్మఒడి లాంటి పథకాలెన్నో అందించామన్నారు. ఏ ప్రభుత్వ హయాంలో మేలు జరిగింది, ఎవరి హయాంలో అన్యాయం జరిగిందో ప్రతి మహిళ ఆత్మ పరిశీలన చేసుకోవాలన్నారు. యువనేత ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అనేక సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతుంటే టీడీపీ నాయకులు మాత్రం ప్రభుత్వ సొమ్మును వృథా చేస్తున్నారని చెప్పడం సిగ్గుచేటన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళలను మహరాణులు చేస్తే.. టీడీపీ ప్రభుత్వ హయాంలో చంద్రబాబు మహిళలను మోసం చేశారన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు చిట్టి జనార్దనరావు, రాగోలు సర్పంచ్ గేదెల శంగల్వరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జెడ్పీ మాజీ చైర్మన్ ఎచ్చెర్ల సూర్యనారాయణ, మహిళా నాయకురాలు బొడ్డేపల్లి పద్మజ, ఎంపీపీ అంబటి నిర్మల, జెడ్పీటీసీ సభ్యురాలు రుప్ప దివ్య, ఏఎంసీ చైర్మన్ మూకళ్ల తాతబాబు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ గొండు కృష్ణమూర్తి, పార్టీ నాయకులు చల్లా రవికుమార్, చిట్టి రవికుమార్, బగాది మనోజ్, లోలుగు శ్రీనివాసరావు, యజ్జల గురుమూర్తి, యాళ్ల శ్రీను, గొండు శార్వాణి, బగ్గు అప్పారావు, గుండ మోహన్, చంద్రమౌళి, తహసీల్దార్ ఎస్.వెంకట్రావు, ఎంపీడీవో రఘు, ఏపీఎం సుజాత పాల్గొన్నారు.



శ్రీకాకుళం రూరల్: హాజరైన మహిళలు



శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): పీఎస్ఎన్ఎం స్కూల్ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు

ఆర్థిక ప్రగతికి చిహ్నం 'ఆసరా'

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): మగువల ఆర్థిక ప్రగతికి చిహ్నం ఆసరా పథకమని మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. నగరంలోని పీఎస్ఎన్ఎం స్కూల్ ప్రాంగణంలో ఆసరా సంబరాలు జరిగాయి. గొంటి వీధి, ఇప్పిలి వీధి, పెద్దరెల్లి వీధి, పుణ్యపు వీధి, రైతు బజార్, సెవెన్ రోడ్ జంక్షన్, డీసీసీబీ కాలనీ, బాకర్ సాహెబ్‌పేట, సానా వీధి సచివాలయాల పరిధిలో ఉన్న లబ్ధిదారులంతా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం 1535 సంఘాల్లోని 15,397 మంది సభ్యులకు రూ.12.08 కోట్లు మంజూరు చేశారన్నారు.

ఎల్లో మీడియా ఎన్ని అబద్ధపు రాతలు రాసినా తన ప్రతిష్ట తగ్గలేదని, ఏ ఒక్క అభిమానిలోను ఇసుమంత అభిమానం కూడా తగ్గించలేరన్నారు. కొన్ని సిద్ధాంతాలకు అనుగుణంగా పనిచేస్తానని స్పష్టం చేశారు. మహిళా సంక్షేమానికి వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తోందన్నారు. గతంలో ఇంత సమర్థనీయస్థాయిలో పథకాలు అమలు చేసిన దాఖలాలు లేవన్నారు. అవినీతికి తావులేకుండా సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేస్తున్నామన్నారు. అధికారం లేకపోవడంతో టీడీపీ నేతలు మాయమాటలు చెప్పేందుకు వీధుల్లోకి వచ్చి ఎత్తు గడలు వేస్తారని.. ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ చల్లా ఓబులేసు, యువనేత ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు, మున్సిపల్ మాజీ చైర్మన్ ఎం.వి పద్మావతి, నాయకులు చల్లా అలివేలు మంగా, బొడ్డేపల్లి పద్మజ, సుగుణరెడ్డి, సాగి రమాదేవి, సాధు వైకుంఠరావు, కోణార్క్ శ్రీను, డాక్టర్ పైడి మహేశ్వరరావు, రఫీ, సుంకరి కృష్ణ, తెలుగు రమేష్, వరుదు విజయ్, టి.బాలకృష్ణ, లావేటి శ్యామ్, బలగ పండరి నాథ్ పాల్గొన్నారు.

ఘనంగా పండిత సత్కారాలు



సత్కారం పొందిన పండితులతో మంత్రి ధర్మాన తదితరులు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి వారి వార్షిక కల్యాణోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం ఆలయ అనివెట్టి మండపంలో పండిత సదస్యం, మహాదాశీర్వదాలు, వేద సదస్సు, పండిత సత్కారం కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈవో వి.హరిసూర్యప్రకాష్, ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సులో రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు హాజరై పండితులను సత్కరించారు. పలువురు పండితులు అప్పటికప్పుడు ఆదిత్యునిపై, అలాగే ప్రధానార్చకులు శంకరశర్మ అర్చనావిధానాలపై కలిగిన భావాలను కాగితాలపై రాసి స్వామి ఉత్సవమూర్తుల వద్ద నివేదించారు. వీరికి మంత్రి ధర్మాన దుశ్శాలువలతో సత్కరించి, స్వామి వారి ప్రసాదాలను అందజేశారు.

కార్యక్రమంలో పండితులు ధూళిపాళ మహాదేవ మణి (రాజమహేంద్రవరం), భాస్కరభట్ల నరసయ్యశర్మ, భాస్కరభట్ల శ్రీరామమూర్తి, బంకుపల్లి రమేష్, సుసరాపు చంద్రశేఖరశర్మ, రంప సాయిశర్మ, నేతేటి గణేశ్వరరావు తదితరులతో పాటు వేదపండితులు సుమారు 25 మందికి ఘనంగా సన్మానించారు. అంతకుముందు ఆదిత్యుని కల్యాణమూర్తులకు నిత్యోపాసన, విశేష పూజ, మంగళహారతి వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ పాలకమండలి సభ్యులు నెమలపురి కోటేశ్వర శర్మ, ద్వారపు అనూరాధ, దుక్క గనిరాజు, జలగడుగుల శ్రీనివాస్, జోగి మల్లెమ్మ, మైలపల్లి లక్ష్మి, తహసీల్దార్ ఎం.వెంకటరావు, ఎస్సై బలివాడ గణేష్ పాల్గొన్నారు.

పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కార్యవర్గం



నూతన కార్యవర్గ సభ్యులు

రణస్థలం: రణస్థలం, లావేరు మండలాల పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్టు జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు బిషప్ డాక్టర్ డీఎస్‌వీఎస్ కుమార్ తెలిపారు. కార్యవర్గ సభ్యులతో మండల కేంద్రంలో సోమవారం సమావేశం నిర్వహించారు. 2023–25 సంవత్సరాలకు అధ్యక్షుడుగా సీహెచ్ రూబేన్, గౌరవ అధ్యక్షుడుగా వి.సురేష్, ఉపాధ్యక్షుడుగా పి.యేసుదాజు, కార్యదర్శిగా డి.రత్నం, ఉప కార్యదర్శిగా ఎం.ఇశ్రాయేల్, ట్రెజరర్‌గా కొమర సన్యాసిరావు, జాయింట్ ట్రెజరర్‌గా ఎల్.జెమ్స్, కార్యవర్గ సభ్యులుగా ఎస్.పాల్, వై.జాన్, ఎ.రవిరెడ్డి, బి.డానియేల్, సలహాదారులుగా కె.ఆమోస్, బి.రవింద్రపాల్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ మైనారిటీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

పౌష్టికాహారంతో మెరుగైన ఆరోగ్యం



రణస్థలం: మానవహారంలో అంగన్‌వాడీలు

రణస్థలం: పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా మెరుగైన ఆరోగ్య సాధ్యమని రణస్థలం ఐసీడీఎస్ పీవో రుూన్సీ అన్నారు. గర్భిణులు, బాలింతలు, పిల్లలు ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో ప్రభుత్వాలు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పోషకాహారం అందజేస్తోందన్నారు. మండల కేంద్రంలోని ఐసీడీఎస్ కార్యాలయం ఆవరణలో పోషణ పఖ్వాడా పక్షోత్సవాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పోషకహారం లోపం తలెత్తకుండా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు సంపూర్ణ పోషకాలతో కూడిన 15 పదార్థాలను అందజేస్తున్నామన్నారు. అనంతరం మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, సూపర్‌వైజర్లు, ఆయాలు ఉన్నారు.

శ్రీకాకుళం అర్బన్: పోషకాలతో కూడిన ఆహారాన్ని తీసుకోవడం ద్వారానే ఆరోగ్యంగా ఉండవచ్చని డీఆర్‌డీఏ ఉద్యోగిని ఎస్.ధనలక్ష్మి అన్నారు. దమ్మల వీధి సెక్టారు పరిధిలో ఆ సెక్టార్ సూపర్‌వైజర్ సీతామహలక్ష్మి ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం పోషణ పఖ్వాడా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు గల ఆహారాన్ని ఏ విధంగా తయారు చేసుకోవాలో వివరించారు. సాధారణ మహిళలు, గర్భిణులు, బాలింతలు వీటిని ఆహారంగా తీసుకోవడం ద్వారా మరింత ఆరోగ్యకరంగా ఉండవచ్చన్నారు. మిషన్ వాత్సల్య కింద అర్హులైనవారందరూ అకౌంట్‌లు ప్రారంభించాలన్నారు. అలాగే బాల్యవివాహాల వలన వచ్చే నష్టాలను కూడా వివరించారు.

విస్తృత ప్రచారం చేయాలి



పాతర్లపల్లిలో మాట్లాడుతున్న సాయికుమార్

రణస్థలం: సీఎం జగనన్న అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నింటి సాయికుమార్ అన్నారు. జీరుపాలెం, కోటపాలెం, అల్లివలస, కొవ్వాడ, పాతర్లపల్లి, కొచ్చెర్ల గ్రామ సచివాలయ పరిధిలో కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లతో ఇంటింటికీ జగనన్నే మా భవిష్యత్ ప్రచార కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు టొంపల సీతారాం, వైఎస్సార్‌సీపీ నాయకులు లంకలపల్లి ప్రసాద్, చిల్ల వెంకటరెడ్డి, పైడి శ్రీనివాసరావు, మైలపల్లి కామరాజు ఉన్నారు.

ఓపెన్ ఇంటర్ పరీక్షలకు పోలీసు బందోబస్తు



మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ వద్ద బందోబస్తు పరిశీలిస్తున్న ఎస్ఐ గణేష్

శ్రీకాకుళం క్రైమ్: నగరంలోని రెండు కేంద్రాల్లో జరుగుతున్న ఓపెన్ ఇంటర్ పరీక్షలకు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఒకటో పట్టణ ఎస్ఐ గణేష్ తెలిపారు. అరసవల్లిలోని మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్, ప్రభుత్వ జూనియర్ కళాశాలల వద్ద నిర్వహణ ఏర్పాట్లను ఇంటర్ బోర్డు సభ్యులతో కలిసి సోమవారం పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఇంటర్ బోర్డ్ చీఫ్ సూపరింటెండెంట్ ఛార్లీ, ఒకటో పట్టణ ఏఎస్ఐ త్రినాథరావు ఉన్నారు.

స్వాతికి వీసీ అభినందన



స్వాతిని అభినందిస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం జియో సైన్స్‌కు చెందిన అధ్యాపకురాలు గుండ స్వాతి డాక్టరేట్ డిగ్రీ సాధించారు. రాజమహేంద్రవరంలోని ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్ కేవీ స్వామి గైడ్‌గా తూర్పుకనుమల్లో భూ గర్భజలాల పరిస్థితిపై పరిశోధన చేశారు. ఈమెను వీసీ నిమ్మ వెంకటరావు సోమవారం అభినందించారు.

మణికంఠకు డాక్టరేట్



మణికంఠకు డాక్టరేట్ అందజేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం అర్బన్: న్యూ శ్రీకాకుళం బ్లడ్ బ్యాంక్ మేనేజర్ టి.మణికంఠ సేవలను గుర్తిస్తూ సెయింట్ పాల్స్ థియోలాజికల్ కళాశాల వారు గౌరవ డాక్టరేట్ అందించారు. కోవిడ్ వారియర్స్, ప్లాస్మా దానాలు, ఫ్రంట్ లైన్ వర్కర్స్‌కి చేయూత, కరోనాతో మరణించిన వారికి దహన సంస్కారాలు, తలసేమియా, ఎయిడ్స్ వంటి దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతున్న చిన్నారులకు ఉచితంగా పౌష్టకాహారం, రక్తంను మణికంఠ అందించడం అభినందనీయమని సెయింట్ పాల్స్ ప్రిన్సిపాల్ కేవీఏస్ పాల్ ప్రశంసించి డాక్టరేట్‌ని అందించారు.

కొయ్యాంలో పారిశుద్ధ్య పనులు

ఎచ్చెర్ల: కొయ్యాం పంచాయతీ పరిధిలోని పలు గ్రామాల్లో సోమవారం పారిశుద్ధ్య పనులు చేపట్టారు. వీధుల్లో చెత్తాచెదారాలను తొలగించి శుభ్రం చేశారు. వాటర్‌ట్యాంక్‌ల వద్ద క్లోరినేషన్ చేపట్టారు. సచివాలయం సిబ్బంది పనులను పర్యవేక్షించారు.

ఇంటింటికీ సంక్షేమ పథకాలు



ప్రచారంలో వైఎస్సార్‌సీపీ నాయకులు

ఎచ్చెర్ల క్యాంపస్: అర్హతే ప్రామాణికంగా ఇంటింటికీ సంక్షేమ పథకాలు చేరవేస్తున్నట్లు మండల సచివాలయాలు కన్వీనర్ మూగి శ్రీరాములు అన్నారు. కుప్పిలి గ్రామంలో సోమవారం ఇంటింటికీ ప్రభుత్వ పథకాలు ప్రచార కార్యక్రమాల్లో భాగంగా గృహ సారథులతో సమావేశం నిర్వహించారు. ఈ నెల ఏడు నుంచి జగనన్నే మన భవిష్యత్తు కార్యక్రమం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్నట్లు చెప్పారు. ప్రతి ఇంటికీ వెళ్లి పార్టీ అందజేసిన కరపత్రాలు, స్టిక్కర్లు, ప్రచార సామగ్రి అందజేయనున్నట్లు వివరించారు. ఈ నెల 14వ తేదీ వరకు ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బల్లాడ జనార్దనరెడ్డి, నాయకులు బల్లాడ వెంకట అప్పారావు పాల్గొన్నారు.

'ఉపాధి'ని సద్వినియోగం చేసుకోవాలి



పనులు ప్రారంభిస్తున్న తిరుపతిరావు

లావేరు: ఉపాధిహామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్‌సీపీ మండల ప్రధాన కార్యదర్శి దేశెట్టి తిరుపతిరావు అన్నారు. రావివలస గ్రామంలో సోమవారం ఉపాధిహామీ పథకం పనులను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో ఉండే వేతనదారులు పనుల కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లకుండా ఉండటం కోసం ప్రభుత్వం స్థానికంగా పనులు కల్పిస్తోందన్నారు. జాబ్‌కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి ఏడాదికి 100 రోజులు పనులు కల్పించడం జరుగుతుందని వినియోగించుకోవాలన్నారు.

'పది' పరీక్షలు ప్రారంభం



రణస్థలం: జె.ఆర్.పురం కేంద్రంలో పరీక్షలు రాస్తున్న విద్యార్థులు



జి.సిగడాం: జెడ్పీ పాఠశాల కేంద్రం వద్ద బందోబస్తులో ఏఎస్సై రామకృష్ణ

ఎచ్చెర్ల క్యాంపస్: పదో తరగతి పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. అధికారులు విద్యార్థులకు ఇబ్బంది లేకుండా పక్కా ఏర్పాట్లు చేశారు. పరీక్ష కేంద్రాల వద్ద 114 సెక్షన్ అమలు చేశారు. విద్యా, పోలీసుశాఖాధికారులు కేంద్రాలను పర్యవేక్షించారు. పిల్లలకు పరీక్షకు బయలుదేరి వెళ్లే ముందు ఆలయాల్లో పూజలు చేశారు. ఎచ్చెర్ల మండలంలో ఐదు కేంద్రాల్లో తొలిరోజు పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఎచ్చెర్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కేశవరెడ్డి పాఠశాల, బొంతలకోడూరు, కుప్పిలి మోడల్ స్కూల్, ఎస్ఎంపురంలోని ఏపీ గురుకుల పాఠశాలల్లో పరీక్షలు జరుగుతున్నాయి. ఈ కేంద్రాల్లో 1160 మంది విద్యార్థులు పరీక్ష రాస్తున్నారు.

జి.సిగడాం: జి.సిగడాం మండలంలో తొలిరోజు పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. మండల కేంద్రంలో మూడు కేంద్రాల్లో 562 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. జిల్లాపరిషత్ పాఠశాలలో 221 మంది, మోడల్ పాఠశాలో 214 మంది, జూనియర్ కళాశాలో కేంద్రంలో 127 మంది పరీక్ష రాశారు.

-రణస్థలం: మండలంలో ఐదు కేంద్రాలను కేటాయించారు. ఆదర్శ పాఠశాల, జె.ఆర్.పురం హైస్కూల్లో రెండు సెంటర్లు, పైడిభీమవరంలో రెండు సెంటర్లలో 1213 మందికి గాను 1210 మంది పరీక్షకు హాజరైనట్లు ఎంఈవో ఎ.త్రినాథరావు తెలిపారు. ఆదర్శ పాఠశాల, జె.ఆర్.పురంలోని కేంద్రాలను డీఈవో పగడాలమ్మ సందర్శించారు.

గట్టి పోలీసు బందోబస్తు

శ్రీకాకుళం క్రైమ్: శ్రీకాకుళం సబ్ డివిజనల్ పరిధిలోని 12 పోలీస్ స్టేషన్ల పరిధిలో ఉన్న పది మండలాల్లో 55 కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు జరుగుతున్నాయి. జిల్లా ఎస్పీ జి.ఆర్.రాధిక ఆదేశాల మేరకు కేంద్రాల వద్ద గట్టిపోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. తొలిరోజు పలు కేంద్రాలను పోలీసు అధికారులు తనిఖీ చేశారు.

అడిషనల్ ఎస్పీ టి.పి.విఠలేశ్వరరావు, డీఎస్పీ మహేంద్ర మాతేలు పలు కేంద్రాలను సోమవారం సందర్శించారు. ఒక్కో కేంద్రానికి ముగ్గురు సిబ్బంది (ఇద్దరు మగ, ఒక మహిళా పోలీసు)ని నియమించారు. గుజరాతీపేట ఏవీఎన్ హైస్కూల్‌ను అదనపు ఎస్పీ విఠలేశ్వరరావు సందర్శించి బందోబస్తు, నిర్వహణా ఏర్పాట్లను పరిశీలించారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, భాష్యం, నారాయణ హైస్కూళ్లలో ఏర్పాటు చేసిన కేంద్రాలను డీఎస్పీ మహేంద్ర మాతే తనిఖీ చేశారు. పీఎన్ కాలనీలోని న్యూ సెంట్రల్ హైస్కూల్, ఒకటో పట్టణ పరిధిలోని కేశవరెడ్డి హైస్కూళ్లను సీఐలు పప్పల శ్రీనివాసరావు, లెంక సన్యాసినాయుడు పర్యవేక్షించారు. వీరి వెంట ఒకటో పట్టణ ఎస్సై బి.గణేష్, రెండో పట్టణ ఎస్సై కె.వెంకటేష, సిబ్బంది ఉన్నారు.



జి.సిగడాం: కేజీబీవీలో సరస్వతిదేవికి పూజలు చేస్తున్న బాలికలు



గుజరాతీపేటలోని ఏవీఎన్ హైస్కూల్ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఏఎస్పీ టి.పి.విఠలేశ్వరరావు



పీఎన్ కాలనీలోని ఎన్‌సీఎస్ కేంద్రం వద్ద రెండో పట్టణ సీఐ శ్రీనివాసరావు పర్యవేక్షణ



ప్రభుత్వోన్నత పాఠశాల కేంద్రం వద్ద అభ్యర్థులను తనిఖీ చేసి పంపుతున్న డీఎస్పీ మహేంద్ర మాతే